క్లుప్తంగా

మంత్రి జోగి రమేష్‌కు స్వాగతం



రావులపాలెంలో మంత్రి రమేష్‌కు స్వాగతం పలుకుతున్న ఎంపీపీ గంగాధరరావు, నాయకులు

రావులపాలెం: రాష్ట్ర గృహ నిర్మాణ శాఖామంత్రి, కోనసీమ జిల్లా ఇన్‌చార్జి మంత్రి జోగి రమేష్‌కు శుక్రవారం రావులపాలెంలో వైఎస్సార్ సీపీ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. జిల్లా పర్యటనలో భాగంగా రావులపాలెం వచ్చిన ఆయనకు వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద కొత్తపేట ఎంపీపీ మార్గన గంగాధరరావు, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కర్రి నాగిరెడ్డి, ఉమ్మడి ఈస్ట్ గోదావరి జిల్లా వైఎస్సార్ సీపీ వాణిజ్య విభాగం అధ్యక్షుడు మంతెన రవిరాజు ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు స్వాగతం పలికాయి. ఆయనకు పూల మాలలు వేసి స్వాగతం పలికారు. స్థానిక సెంటర్లో ఉన్న మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చిర్ల సోమసుందరరెడ్డి విగ్రహాలకు మంత్రి రమేష్ పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఎంపీఈఓ భవానీకి అవార్డు



మంత్రి అప్పలరాజు నుంచి అవార్డు అందుకుంటున్న భవాని

మామిడికుదురు: సీఫుడ్ ఫెస్టివల్‌లో భాగంగా విజయవాడలో శుక్రవారం జరిగిన సమావేశంలో మామిడికుదురు ఎంపీఈఏ బళ్ల భవాని ప్రతిభ చూపినందుకు అవార్డు అందజేశారు. రాష్ట్ర మత్స్యశాఖా మంత్రి సిదిరి అప్పలరాజు, ఫిషరీస్ కమిషనర్ కన్నబాబు చేతుల మీదుగా ఈ అవార్డు అందజేశారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా రూపొందించిన ఫిష్ ఆంధ్రా మినీ అవుట్‌లెట్ యూనిట్ల ఏర్పాటులో రికార్డు స్థాయిలో 18 షాపులు ఏర్పాటు చేసిన భవానీ రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచారు.

కంప్యూటర్ బహూకరణ

మలికిపురం: మండలంలోని కేశనపల్లి ఉన్నత పాఠశాలకు పాఠశాల పూర్వ విద్యార్థులు యెనుముల సత్య వెంకట రామ నాగేశ్వరరావు– సుధా పూర్ణ దంపతులు కంప్యూటర్ బహూకరించారు. రూ.40 వేల విలువైన కంప్యూటర్‌ను శుక్రవారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్. ఉమామహేశ్వరరావుకు అందించారు. సర్పంచ్ యెనుముల నాగు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ ఆనందం రాంబాబు చేతుల మీదుగా దీనిని అందించారు.

పాత అక్విడెక్టుపై రాకపోకల నిలిపివేత

పి.గన్నవరం: వైనతేయ నది ఉధృతంగా ప్రవహిస్తోన్న నేపథ్యంలో పి.గన్నవరం పాత అక్విడెక్టుపై రాకపోకలను నిలిపివేసినట్టు ఎస్సై హరికోటి శాస్త్రి తెలిపారు. పాత అక్విడెక్టుకు ఇరువైపులా బారికేడ్లు ఏర్పాటు చేశారు. పాత, కొత్త అక్విడెక్టుల వద్ద వరద ఉధృతిని తిలకించేందుకు పెద్ద ఎత్తున జనం తరలివస్తున్నారు. ఈనేపథ్యంలో పాత అక్విడెక్టుపై సెల్ఫీల కోసం యువత ఎగబడుతున్నారు. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా పాత అక్విడెక్టుపైకి ఎవరూ వెళ్లకుండా పోలీసు సిబ్బందిని నియమించినట్టు ఎస్సై తెలిపారు.

డెంగీ జ్వరాలు రాకుండా జాగ్రత్తలు

రావులపాలెం: డెంగీ జ్వరాలు రాకుండా ప్రజలు పరిసరాల పరిశుభ్రత జాగ్రత్తలు పాటించాలని ఊబలంక పీహెచ్‌సీ వైద్యులు హసీనా, శ్రీకాంత్ అన్నారు. శుక్రవారం మండలంలోని కొమరాజులంకలో పీహెచ్‌సీ వైద్య సిబ్బందితో డ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ హసీనా మాట్లాడుతూ దోమలు వ్యాప్తి ప్రమాదకరమని ఆరోగ్యానికి హానికరం అన్నారు. గ్రామంలో పర్యటించి నివాస ప్రాంతాలను పరిశీలించారు. దోమల వ్యాప్తికి కారణమైన అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతీ శుక్రవారం డ్రైడే పాటించాలని దోమలు వృద్ధి కాకుండా తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. డాక్టర్ శ్రీకాంత్, సీహెచ్‌ఓ కాంతమ్మ, బిషప్, సత్యనారాయణ, సామ్యూల్‌రాజు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యంపై కేసు

ఆత్రేయపురం: మండల పరిధిలోని ర్యాలి గ్రామానికి చెందిన 17 ఏళ్ల బాలిక అదృశ్యంపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై వై. కిరణ్‌కుమార్ తెలిపారు. ఈ నెల 26న ఇంటి నుంచి బయటకు వెళ్లిన బాలిక ఆచూకీ లభించక పోవడంతో ఆమె తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

కొట్టుకుపోయిన తేనె పరిశ్రమ

పి.గన్నవరం: గ్రామ శివారు తాటికాయలవారి పాలెం వద్ద లంకలో ఏర్పాటు చేసిన తేనె పరిశ్రమ శుక్రవారం వరద ఉధృతికి కొట్టుకుపోయింది. తేనెటీగల పెంపకం యూనిట్లు కొట్టుకుపోవడంతో రూ.2.5 లక్షల మేర నష్టం వాటిల్లినట్టు రైతు పితాని సత్యనారాయణ ఆవేదన వ్యక్తం చేశారు.

అల్లవరం పీరుకు పూజలు

మామిడికుదురు: త్యాగాలకు ప్రతీకగా నిలిచే మొహరం సంతాప కార్యక్రమాల్లో భాగంగా అల్లవరం నుంచి వచ్చిన పీరుకు శుక్రవారం హిందువులు మొక్కులు చెల్లించి మత సామరస్యాన్ని చాటుకున్నారు. పీరును దర్శించుకుని ముడుపులు, మొక్కుబడులు చెల్లించారు. ఏటా మొహరం సంతాప దినాల్లో అల్లవరం నుంచి పీరును తీసుకు వచ్చి నగరం, మామిడికుదురు వీధుల్లో ఊరేగించడం ఆనవాయితీ.



ఊడిమూడి ఏటిగట్టుపై తాత్కాలిక గుడిసెలు ఏర్పాటు చేసుకున్న బాధితులు



అప్పనరామునిలంక మధ్యగ్రూపులో వరద నీటిలో చిక్కుకున్న పాఠశాల



అంబాజీపేట మండలం వాకలగరువులో నీట మునిగిన దొండ, కొబ్బరి తోట



పెదపట్నంలో వరద నీటిలో నుంచి రెండెడ్ల బండిపై కొబ్బరి కాయల తరలింపు



మూలస్థాన అగ్రహారం శివారు తోకలంక వెళ్లే రహదారిలో ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి

పెరిగినది

- శాంతించని వరద గోదావరి
- లోతట్టు ప్రాంతాల్లోకి పోటెత్తుతున్న నీరు

సఖినేటిపల్లి: ధవళేశ్వరం బ్యారేజీ నుంచి దిగువకు విడుదల చేస్తున్న గోదావరి వరద నీటి ప్రవాహం శుక్రవారం మరింత పెరిగి మండలంలో గోదావరి నదీ పరీవాహక ప్రాంతాల వెంబడి లోతట్టు ప్రాంతాల్లోకి నీరు పోటెత్తింది. దీంతో సఖినేటిపల్లి లాకుల వద్ద నుంచి టేకిశెట్టిపాలెం వరకూ గోదావరి పాయ వెంబడి కూడా పల్లపు ప్రాంతాల్లోకి వరద నీరు పోటెత్తింది. సఖినేటిపల్లి రేవులో పెరిగిన గోదావరి వరద ఉధృతికి పంటు రాకపోకలను అధికారులు నిలిపివేశారు. ఇక్కడ ప్రయాణికులు పంటు పైకి వెళ్లే రేవులోకి వరద నీరు పోటెత్తింది. రేవును ఆనుకుని ఉన్న నివాస గృహాల వద్దకు నీరు చేరింది. సఖినేటిపల్లి బోను వద్ద ఏటిగట్టు రక్షణకు ఇసుక బస్తాలను, సర్వే బాదులను సిద్ధం చేశారు. సఖినేటిపల్లి లాకుపేటలో వరద మరింత పోటెత్తి నివాస గృహాల వద్ద పరవళ్లు తొక్కుతోంది. సఖినేటిపల్లి వైపు గోదావరి పాయపైలో లెవిల్ కాజ్ వే వరద నీటిలో ఉంది. పెరుగుతున్న వరద గోదావరి ఉధృతికి అప్పనరామునిలంకలో ప్రధాన రహదారులు, మధ్యగ్రూపులో వరద నీటిలో ప్రాథమిక పాఠశాల చిక్కుకుంది. టేకిశెట్టిపాలెం వద్ద ఏటిగట్టు దిగువ నుంచి అప్పనరామునిలంక గ్రామానికి పోయే ప్రధాన రహదారిలోని గోదావరిపాయ(బాడి కాలువ)పై కొత్తగా ఎత్తులో నిర్మించిన కాజ్ వే వద్ద వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. అప్పనరామునిలంక గ్రామస్తులు ప్రత్యామ్నాయంగా రామరాజులంక మీదుగా బాహ్య ప్రపంచంలోకి రాకపోకలు సాగిస్తున్నారు.

వరదను పరిశీలించిన తహసీల్దారు

టేకిశెట్టిపాలెం ఏటిగట్టు దిగువన వరద ఉధృతిని తహసీల్దారు వై.రామకుమారి పరిశీలించారు. ఈ ప్రాంతంలో నిలిచిపోయిన రవాణా మార్గాలపై ఆమె స్థానికులతో చర్చించారు. వరద ఉధృతిని ఎప్పటికప్పుడు బేరీజు వేసుకుంటూ తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎంపీపీ వీరా మల్లిబాబు, సర్పంచ్ ఇందుకూరి సుబ్బరాజు, సీనియర్ అసిస్టెంట్ రామరాజు, రెవెన్యూ, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

నీటమునిగిన ఇళ్లు, కొబ్బరి తోటలు

అంబాజీపేట: వైనతేయ గోదావరి శుక్రవారం ఉధృతంగా ప్రవహించి గ్రామాల్లో ఉండే కౌశికలు ఉరకలు వేస్తున్నాయి. నందంపూడి, వాకలగరువు గ్రామాల్లో ఇళ్లు, కొబ్బరి, అరటి, దొండ పాదులు నీట మునిగాయి. గోదావరి సమీపంలో ఉన్న కౌశికలోకి వరద నీరు చేరడంతో కాలనీలు, అరటి, కొబ్బరితోటలను ముంచెత్తుతున్నాయి. నందంపూడి బొంతువారిపేటలో ఆరు ఇళ్లు నీట మునిగాయి. వాకలగరువు రజకపేటకు వెళ్లే ప్రధాన రహదారి నీట మునగడంతో స్థానికులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇళ్ల మధ్యకు వరద నీరు చేరి మోకాలి లోతులో ప్రవహిస్తోంది. అంబాజీపేట పీహెచ్‌సీ ఏఎన్ఎంలు, సచివాలయ ఉద్యోగులు ముంపు ప్రాంతాల్లో పర్యటించారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని బాధితులకు తెలిపారు. తొండవరం వెన్నపువారికాలనీలో శుక్రవారం ఓ తాటాకిల్లు నేలమట్టమయింది. ముత్తాబత్తుల నాగేంద్రరావుకు చెందిన తాటాకిల్లు వర్షాలకు పూర్తిగా తడిసి ముద్దవడంతో ఒక్కసారిగా కుప్పకూలిపోయింది. ఈ సమయంలో నాగేంద్రరావు కుమార్తె ప్రియాంక ఇంటిలో ఉండగా ఒక్కసారిగా కూలిపోతున్న శబ్దం రావడంతో స్థానికుల సహాయంతో ప్రాణాలతో బయటపడింది. నేలకొరిగిన తాటాకిల్లును తహసీల్దార్ టి.మంగతాయారు, ఎంపీడీఓ కె.సత్యనారాయణ సందర్శించి బాధితులను ఓదార్చారు.

బాధితులను ఆదుకుంటాం

వరద బాధితులను ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. శుక్రవారం మండలంలోని ముక్తేశ్వరం–అయినవిల్లిలంక వెదురుబిడెం కాజ్‌వే వద్ద వరద పరిస్థితిని ఆయన సమీక్షించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వరద బాధితులను ఆదుకునేందుకు చర్యలు చేపట్టారన్నారు. ముక్తేశ్వరం–అయినవిల్లిలంక వెదురుబిడెం కాజ్‌వే చిన్నపాటి వరదకే మునుగుతోందన్నారు. ఈ కాజ్‌వే పై వంతెన నిర్మాణం కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామన్నారు. నిధులు మంజూరు కాగానే వంతెన నిర్మాణ పనులు చేపట్టి ఈ సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తామన్నారు.



ముక్తేశ్వరం-అయినవిల్లిలంక వెదురుబిడెం కాజ్‌వే వద్ద పడవలపై దాటుతున్న లంక ప్రజలు

ఎస్ఐ ఎస్.నాగేశ్వరరావు, డిప్యూటీ తహసీల్దార్ అశోక్ ఉన్నారు.

నీట మునిగిన అప్పనపల్లి కాజ్‌వే

మామిడికుదురు: పాశర్లపూడి కరకట్ట దిగువన ఉన్న అప్పనపల్లి కాజ్‌వేపై భారీగా వరద నీరు ప్రవహిస్తోంది. ఇక్కడ మూడడుగుల మేర వరద నీరు పొంగి ప్రవహిస్తోంది. దీంతో రాకపోకలను నిలిపివేశారు. అప్పనపల్లి, బి.దొడ్డవరం, పెదపట్నంలంక గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో పాటు అప్పనపల్లి పెట్రోల్ బంకు సమీపంలో ప్రధాన రహదారి సైతం ముంపు బారిన పడింది. బి.దొడ్డవరం ఆర్ అండ్ బీ రోడ్డు కూడా జలదిగ్బంధంలో చిక్కుకుంది. మామిడికుదురు శివారు కొర్లగుంట ఏటిగట్టు దిగువ నుంచి అప్పనపల్లి వెళ్లే రోడ్డు ముంపులో చిక్కుకుంది. దీంతోపాటు పెదపట్నం, పాశర్లపూడి, పాశర్లపూడిలంక గ్రామాలకు సైతం వరద ముంపు పొంచి ఉంది. పెదపట్నం మధ్య లంక పూర్తిగా ముంపు బారిన పడడంతో పసుగ్రాసంతో పాటు అక్కడ ఉన్న పశువులను రైతులు ఇంజిన్ నావలపై సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ముంపు భయంతో అప్పనపల్లి, బి.దొడ్డవరం గ్రామాల నుంచి సైతం పశువులను ఏటిగట్టు ఎగువ ప్రాంతాలకు తరలించారు. పై మూడు గ్రామాల్లో కొబ్బరి కాయలు దింపు తీసి రెండెడ్ల బళ్లపై సురక్షిత ప్రాంతాలకు తరలించుకోవడంలో రైతులు ఇబ్బందులు పడ్డారు.

ముంపు బారిన లంక పంట పొలాలు

రావులపాలెం: మండలంలోని పలు గ్రామాల్లో లంక పొలాలు శుక్రవారం కొంత మేర నీట మునిగాయి. అయితే గోదావరికి శనివారం నాటికి మరింత వరద నీరు చేరే అవకాశం ఉందని రైతులు లంక ప్రాంతాల్లో చేతికి అందివచ్చిన పంటలను, పశువులను గట్టు మీదుకు చేరుస్తున్నారు. మండలంలోని ఊబలంక, రావులపాలెం, కొమరాజులంక, గోపాలపురం, పొడగట్లపల్లి లంక ప్రాంతాల్లో పశువుల గడ్డి నీట మునిగింది. దొండ, మిరప, వంగ తదితర కూరగాయలు తోటలు, అరటి, కంద లాంటి వాణిజ్య పంటలు నీట మునిగాయి. దీంతో రైతులు చేసేది లేక నావలపై వెళ్లి చేతికి అందిన అరటి గెలను ఒడ్డుకు చేర్చి మార్కెట్‌కు తరలిస్తున్నారు.

నీటిలోనే రాకపోకలు

ఆలమూరు: మండలంలోని బడుగువానిలంకలోని అన్ని వైపులా ఉన్న గయ్యాలీ, పొగరుబోతు, చెముడు లంక పాయల్లో వరద నీరు వచ్చి చేరింది. ఇప్పటికే మూలస్థాన అగ్రహారం శివారు ప్రాంతమైన తోకలంకకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. గ్రామంలోకి వరద నీరు వచ్చి చేరడంతో పాటు రహదారి వెంబడి ఉధృతంగా ప్రవహిస్తోంది. స్థానికులు వరద నీటిలోనే రాకపోకలు సాగిస్తున్నారు. జొన్నాడలోని పుష్కరాల రేవు, శ్మశానవాటిక మునిగిపోయాయి. మూలస్థాన అగ్రహారం లంక భూముల్లోనున్న ఇటుక బట్టీలు వరద నీటిలో చిక్కుకున్నాయి. పాడి రైతులు తమ. పశువులను ఏటిగట్టపైకి తీసుకు వచ్చి పశుపోషణ సాగిస్తున్నారు. తహసీల్దార్ జె.ఐపి. శెట్టి, ఎంపీడీఓ కె.జాన్‌లింకన్, రావులపాలెం సీఐ ఎన్.రజనీకుమార్, ఎస్సై ఎస్.శివప్రసాద్ ఆధ్వర్యంలో అధికారులు లంక ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి సిబ్బందికి పలు సూచనలు, సలహాలను అందజేశారు.

పంట పొలాల్లోకి నీళ్లు

ఆత్రేయపురం: మండల పరిధిలోని బొబ్బర్లంక, పిచ్చుకలంక, వాడపల్లి, వెలిచేరు, పేరవరం, తాడిపూడి, వసంతవాడ, కట్టుంగ గ్రామాల పంట పొలాలు నీట మునిగాయి. అరటి, కంద, పసుపు, బొప్పాయి వంటి పంటలతో పాటు పశువులకు పశుదాణా సాగు చేస్తున్న రైతులకు నష్టం వాటిల్లిందని రైతులు వాపోతున్నారు.

లంక గ్రామాలు జలమయం

అయినవిల్లి: మండలంలోని అయినవిల్లిలంక, వీరవల్లిపాలెం, తొత్తరమూడి కె.పెదలంక, పొట్టిలంక, కొండుకుదురులంక గ్రామాల్లోని పల్లపు ప్రాంతాలు జలమయం అయ్యాయి. ముక్తేశ్వరం–అయినవిల్లిలంక వెదురుబిడెం వద్ద కాజ్‌వే పై వరదనీరు ఉధృతిగా ప్రవహిస్తోంది. వీరవల్లిపాలెం, అయినవిల్లిలంక, కపిలేశ్వరపురంలో అద్దంకివారి లంక ప్రజల రాకపోకలు స్తంభించాయి. పడవలపై రాకపోకలు కొనసాగిస్తున్నారు. అధికారులు పడవలు ఏర్పాటు చేసి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టారు. ముక్తేశ్వరంలోని తొగరపాయలో వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తుంది. ప్రజా ప్రతినిధులు, అధికారులు సహాయక చర్యలు సమీక్షిస్తున్నారు.

లంక గ్రామాలు జలమయం

పి.గన్నవరం: మండలంలోని ఊడిమూడిలంక, జి.పెదపూడిలంక, అరిగెలవారిపేట, బూరుగులంక గ్రామాలకు ఇప్పటికే బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు పడవలపై రాకపోకలు సాగిస్తున్నారు. రెండు పడవలు దాటి లంకలోకి వెళ్లాల్సి వస్తోంది. శుక్రవారం కె.ఏనుగుపల్లి రహదారిపై నాలుగు అడుగుల ఎత్తున వరదనీరు ప్రవహిస్తోంది. వరద ఉధృతిలో ప్రజలు నడుంలోతు నీటిలో రాకపోకలు సాగిస్తున్నారు. మానేపల్లి శివాయలంక, పల్లిపాలెం రహదారులపై వరదనీరు ప్రవహిస్తోంది. నాగుల్లంక శివారు గుద్దాయలంక, ఎల్.గన్నవరం, మొండెపులంక, జొన్నల్లంక, వై.కొత్తపల్లి తదితర గ్రామాలను వరదనీరు చుట్టిముట్టింది. మొండెపులంక శివారు పశ్చిమ గోదావరి జిల్లా పుచ్చల్లంక రహదారి నీట మునిగింది. ఉభయ గోదావరి జిల్లాల సరిహద్దులో ఉన్న పెదమల్లంక, ఆనగర్లంక, అయోధ్యలంక, కనకాయలంక గ్రామాల ప్రజలు పడవలపై ప్రయాణిస్తున్నారు. బూరుగులంక రేవులో 20 మందితో కూడిన ఎన్డీఆర్ఎఫ్ బృందాన్ని ఏర్పాటు చేశారు. రెండు హైస్పీడ్ బోట్లను అందుబాటులో ఉంచారు.

20 పునరావాస కేంద్రాల ఏర్పాటు

వరద తాకిడికి గురయ్యే తొమ్మిది గ్రామాల్లో 20 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు పి.గన్నవరం తహసీల్దార్ జి.రవీంద్రనాథ్ ఠాగూర్ తెలిపారు. పునరావాస కేంద్రాల్లో బాధితులకు ఆహారం అందించేందుకు బియ్యం, కిరాణా సరుకులు, కూరగాయలు, తాగునీరు, గ్యాస్, వంట పాత్రలను సిద్ధం చేశామన్నారు. ఎటువంటి వరద పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు ప్రభుత్వ యంత్రాంగం సిద్ధంగా ఉందన్నారు. వరద ముంపు ప్రాంతాల్లో మండల ప్రత్యేక అధికారి తిక్కా వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ ఎం.భారతి పర్యటించారు.

అందరూ అప్రమత్తం కావాలి

కొత్తపేట: గోదావరి వరదలు ఉధృతి తీవ్ర స్థాయిలో ఉన్నందున లంక గ్రామాల ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ జీడీ కిషోర్‌బాబు హెచ్చరించారు. ఆయన శుక్రవారం మండల, గ్రామ స్థాయి అధికారులు, సిబ్బందితో కలిసి వానపల్లి శివారు నారాయణలంక, సత్తెమ్మలంక తదితర లంక గ్రామాల్లో పర్యటించారు. వరద ముంపు ఏర్పడితే అన్ని సహాయక చర్యలు చేపట్టడానికి అధికారులు సిద్ధం కావాలని సూచించారు. పశువులను ముంపు ప్రాంతాల నుంచి ముందస్తుగానే బయటకు తరలించాలని పాడి రైతులకు సూచించారు. గోదావరి ఉధృతి కొనసాగే పరిస్థితులు ఉన్నందున లంక గ్రామాల్లో ప్రజలకు అన్నివిధాలా సహాయక చర్యలు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు. రెవెన్యూ, పోలీస్, ఫైర్ డిపార్టమెంట్‌ల అధికారులతో టీమ్‌లు ఏర్పాటు చేశామన్నారు. నారాయణలంక, సత్తెమ్మలంక గ్రామాల్లో 190 కుటుంబాలు, 680 మంది సభ్యులు ఉన్నారని వారందరికీ అవసరమైతే భోజనాలు ఏర్పాటు చేస్తామన్నారు. గ్రామాల్లో శానిటేషన్, మెడికల్ క్యాంపులు నిర్వహించనున్నట్టు తెలిపారు. వారు బయటకు రాకపోకలు సాగించేందుకు బోట్లు ఏర్పాటు చేశామన్నారు. ఆయన వెంట డిప్యూటీ తహసీల్దార్ ఎస్.శ్రీనివాస్, ఆర్ఐ కె.ఏడుకొండలు, వీఆర్ఓ గొల్లపల్లి సత్యనారాయణ ఉన్నారు.

కాజ్‌వేను పరిశీలించిన మంత్రులు

అయినవిల్లి: వరద బాధితులను ప్రభుత్వం, ఆదికార యంత్రాగం అప్రమత్తం అయిందని, అందులో భాగంగానే తక్షణ సహాయక చర్యలు చేపట్టిందని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి జోగి రమేష్, రాష్ట్ర రవాణా మంత్రి పినిపే విశ్వరూప్, ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. శుక్రవారం మండలంలోని ముక్తేశ్వరం–అయినవిల్లిలంక వెదురుబిడెం వద్ద కాజ్‌వే వద్ద వరద పరిస్థితిని మంత్రులు పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ వరద సహాయక చర్యల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు ఇప్పటికే నిమగ్నమయ్యారన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను తక్షణం నేరవేరుస్తారన్నారు. పడవలపై లంక ప్రాంత ప్రజలను దాటించే సమయంలో చిన్నారులను, విద్యార్థులను ప్రయాణించకుండా నిలిపి వేయాలన్నారు. అత్యవసర పనులకు మాత్రమే వరద సమయంలో పడవలపై ప్రయాణం చేయాలన్నారు. లంక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కొత్తపేట ఆర్డీఓ ఎం.ముక్కంటి, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.



వెదురుబిడెం కాజ్‌వే వద్ద వరద పరిస్థితిని సమీక్షిస్తున్న మంత్రులు, జోగి రమేష్, పినిపే విశ్వరూప్, ఎమ్మెల్యే చిట్టిబాబు తదితరులు

ఇంటింటా పండగ వాతావరణం

సఖినేటిపల్లి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాలనలో ఇంటింటా పండగ వాతావరణం వెల్లువిరుస్తోందని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. శుక్రవారం మోరిపోడు ఆకులవారి వీధిలో మూడో రోజు ఎమ్మెల్యే రాపాక అధికారులు, వలంటీర్లు, సచివాలయ సిబ్బందితో కలిసి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి గడపకూ వెళ్లి సీఎం జగన్ పాలనలో ఆయా కుటుంబాలకు అందించిన సంక్షేమ ఫలాలు వివరించే బ్రోచర్లను ఎమ్మెల్యే అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రజా సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తున్న సీఎం జగన్ పాలనలో ప్రతి గడపకూ పథకాలు చేరుతుండడంతో వారి ఇంట పండగలా ఉందన్నారు. రాజోలు ఏఎంసీ చైర్మన్ గుబ్బల రోజా రమణి, పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు ముప్పర్తి నాగభూషణం, వీవర్స్ సొసైటీ చైర్మన్ జాన శంకరరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు ముప్పర్తి త్రిమూర్తులు, మహిళా నేతలు మొల్లేటి మల్లేశ్వరీ, జ్యోతి, చెల్లుబోయిన శ్రీలక్ష్మి, నాయకులు గెద్దం అమ్ములు, వలవల రాంబాబు, నారాయణ, జి.ఎస్.వి.రాజు, కె.రవి పాల్గొన్నారు.



మోరిపోడులో సంక్షేమ పథకాల బ్రోచర్ అందజేస్తున్న ఎమ్మెల్యే రాపాక

ముంపు ప్రాంతాల పరిశీలన

సఖినేటిపల్లి: మండల పరిధిలోని అప్పనరామునిలంక, టేకిశెట్టిపాలెం వద్ద శుక్రవారం రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు వరద ముంపు ప్రాంతాలను పరిశీలించారు. టేకిశెట్టిపాలెం ఏటిగట్టు వద్ద తహసీల్దారు వై.రామ కుమారి, ఎంపీడీవో జీ.భీమారావుతో పరిస్థితులను సమీక్షించారు. వరద ఉధృతిని దృష్టిలో ఉంచుకుని బాధితులకు సహాయక చర్యలు చేపట్టాలని సూచించారు. ఎంపీపీ వీరా మల్లిబాబు, పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

తోకలంకలో వైద్య శిబిరం

రావులపాలెం: గోదావరి వరదల నేపథ్యంలో ఊబలంక పీహెచ్‌సీ వైద్య సిబ్బంది శుక్రవారం మండలంలోని ఊబలంక శివారు తోకలంకలో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైద్య సిబ్బంది తోకలంకకు నావలపై వెళ్లి స్థానిక ఎంపీపీ పాఠశాల వద్ద వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. తోకలంకలో ఇంటింటి సర్వే నిర్వహించి విషజ్వరాలు వ్యాపించకుండా తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. జ్వరాలతో ఉన్న వారికి మందులు అందజేశారు.

వెంకన్న ఆలయ అభివృద్ధికి కృషి

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీదేవి,భూదేవి సమేత శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని మంత్రి జోగిరమేష్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో అర్చకులు స్వాగతం పలికారు.

అన్నీ మంచి శకునాలే

అయినవిల్లి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్ర ప్రజలకు ఇకపై అన్ని మంచి శకునాలేనని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. శుక్రవారం అయినవిల్లి మండలం వీరవల్లిపాలెం గ్రామంలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే చిట్టిబాబు గడప గడపకూ తిరిగి అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలను అందజేస్తామని హామీ ఇచ్చారు. రహదారులు నిర్మించాలని, ఇంటి నిర్మాణం కోసం రుణాలివ్వాలని ఎమ్మెల్యేను గ్రామస్తులు కోరారు. వరదల సమయంలో నష్టపోయిన రైతులకు, పాడి రైతులకు ప్రభుత్వం సాయం అందించేలా చర్యలు తీసుకోవాలని అడిగారు. ప్రభుత్వం వరద బాధితులను అదుకుంటుందని ఎమ్మెల్యే చిట్టిబాబు హామీ ఇచ్చారు. వైస్ ఎంపీపీ బయ్యా చిన్నిబాబు, మిండగుదిటి శిరీష్, మిండగుదిటి రాంబాబు, వింటిరాజా, దామిశెట్టి బుజ్జి, బొంతు రాజేంద్రపరసాద్ ఉన్నారు.



గడపగడపకూ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే చిట్టిబాబు తదితరులు

మణిపూర్ ఘటన దోషులను శిక్షించాలి

రాజోలు: మణిపూర్ ఘటనకు బాధ్యులైన దోషులను కఠినంగా శిక్షించాలని కోరుతూ రాజోలు బార్ అసోసియేషన్ న్యాయవాదులు శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. భారత న్యాయవాదుల సంఘం (ఐఏఎల్) పిలుపు మేరకు ఆందోళన వ్యక్తం చేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కోట సుధాకర్, ఐఏఎల్ జిల్లా కార్యదర్శి దేవ రాజేంద్రప్రసాద్, న్యాయవాదులు బొంతు శ్రీనివాస్, మెడబల రాజ్‌కుమార్, బత్తుల రవీంద్ర, తాడి సంజీవరావు పాల్గొన్నారు.

దాడులపై నిరసన

అయినవిల్లి: మణిపూర్ దాడులను నిరసిస్తూ పరలోక అగ్ని అపోస్తలిక్ మినిస్ట్రీ చైర్మన్ ఎస్.పాల్ అయినవిల్లి పోలీస్‌స్టేషన్‌లో సీఐ ప్రశాంత్‌కుమార్, ఎస్సై ఎస్.నాగేశ్వరరావుకు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. మణిపూర్‌లో మూడు నెలలుగా గిరిజనులపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ ఆందోళన వ్యక్తం చేశారు.

అమానుషం

మామిడికుదురు: మణిపూర్‌లో క్రైస్తవులపై దాడులు చేయడం అమానుషమని ఫెలోషిప్ నేతల సమావేశం ఆందోళన వ్యక్తం చేసింది. నగరం వై.టోనీ చర్చిలో శుక్రవారం నాలుగు మండలాల ఫెలోషిప్ నేతల సమావేశం జరిగింది. క్రిస్టియన్ మైనార్టీ సెల్ జిల్లా చైర్మన్ కనపాల బాబూరావు, ఉపాధ్యక్షులు ఆర్ఎల్ రాజు, రీజనల్ చైర్మన్ డి.ప్రవీణ్, మండల శాఖ అధ్యక్షుడు సీహెచ్ స్టీవెన్, షారోన్, కె.విజయ్‌కుమార్, డి.మనోహర్‌దాస్ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరి బాధ్యత

కొత్తపేట: పర్యావరణ పరిరక్షణను ప్రతీ ఒక్కరి బాధ్యత అని జెడ్పీటీసీ సభ్యురాలు గూడపాటి రమాదేవి అన్నారు. 'ప్రపంచ పర్యావరణం – ప్రకృతి పరిరక్షణ' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండల పరిధిలోని మోడేకుర్రు గ్రామంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం (ఎన్ఆర్ఈజీఎస్) కొత్తపేట మండల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.

పి.గన్నవరం: ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. పి.గన్నవరంలో శుక్రవారం ఆయన మొక్కలు నాటారు.


ఆలమూరు: ఎస్ఆర్‌జీఈఎస్ ఏపీడీ ఎం.సత్యనారాయణ, ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, జెడ్పీటీసీ సభ్యురాలు తోరాటి సీతామహాలక్ష్మి చెముడులంకలో సర్పంచ్ తమ్మన శ్రీనివాసు ఆధ్వర్యంలో జెడ్పీ హైస్కూల్‌లో మొక్కలను నాటారు.

ఆత్రేయపురం: పేరవరం జెడ్పీ హైస్కూల్ వద్ద ఎంపీపీ కుండ అన్నపూర్ణ, ఎంపీడీఓ నాతిబుజ్జి, సర్పంచ్ గంటి విజయ భారతి మొక్కలు నాటారు.

అంబాజీపేట: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ కె.సత్యనారాయణ అధ్యక్షతన శుక్రవారం మొక్కలను నాటారు. ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యురాలు మైలా నాగలక్ష్మి, మైలా ఆనందరావు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో యువకుడి మృతి

ఆత్రేయపురం: విద్యుత్‌కు షాక్‌కు గురై శుక్రవారం ఓ యువకుడు మృతి చెందాడు. మండలంలోని వెలిచేరు గ్రామానికి చెందిన ర్యాలింగి తరణ్ (18) గేదెల పాక వద్ద విద్యుత్ వైర్లు తగలడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. తరణ్ రావులపాలెంలో ఇంటర్మీడియెట్ చదువుతున్నాడు. తరణ్ మృతితో తల్లిదండ్రులు నాగేశ్వరి, లీలాకృష్ణ బోరున విలపించారు.



తరణ్ (ఫైల్)

సంక్షిప్తం

విద్యాసంస్థల బంద్

మలికిపురం: మండలంలో శుక్రవారం విద్యాసంస్థలు బంద్ పాటించాయి. రాష్ట్ర రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బంద్ పాటించినట్లు ఏబీవీపీ రాజోలు నియోజకవర్గం అధ్యక్షుడు పోలిశెట్టి గణేష్ పేర్కొన్నారు.

వరద ప్రభావిత ప్రాంతాల్లో పశువైద్య శిబిరాలు

పి.గన్నవరం: వరద ప్రభావిత ప్రాంతాల్లో పశు వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామని పి.గన్నవరం సహాయ సంచాలకులు ఎల్.విజయారెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని జి.పెదపూడి, నాగుల్లంక గ్రామాల్లో పశు వైద్యాధికారి కిరణ్ చైతన్య ఆధ్వర్యంలో పశువైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. సర్పంచ్ దంగేటి అన్నవరం, మంతెన రవిరాజు, ఎంపీసీ శ్రీహర్ష పాల్గొన్నారు.

పారదర్శకంగా ఫీవర్ సర్వే

అంబాజీపేట: మండలంలో ఫీవర్ సర్వే పారదర్శకంగా చేయాలని అంబాజీపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యురాలు వి.గౌతమి అన్నారు. ప్రతీ గ్రామంలోని ఇంటింటికి వెళ్లి ప్రజల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఎటువంటి అనారోగ్య పరిస్థితులు ఉన్న గ్రామంలోని ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలకు తెలియజేయాలన్నారు. అవరసమైన వారికి మందులను అందజేయాలని వైద్య సిబ్బందికి సూచించామన్నారు.

ఎంపీటీసీ ఆశాకు అవార్డు

రావులపాలెం: మండలంలోని రావులపాడుకు చెందిన ఎంపీటీసీ సభ్యురాలు గెద్దం ఆశా భారతరత్న అబ్దుల్ కలాం ఇనిస్పిరేషన్‌అవార్డు అందుకున్నట్టు శుక్రవారం ఆమె తెలిపారు. విజయవాడలో ఫిలంత్రోఫిక్ సొసైటీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సేవా విభాగంలో తనకు ఈ అవార్డు ఇచ్చారన్నారు. గత 15 ఏళ్లుగా అనాథలకు, దివ్యాంగులకు మదర్ థెరిసా ఎడ్యుకేషనల్ సొసైటీ నిర్వాహకురాలుగా చేసిన సేవలకు తనకు అవార్డు లభించిందన్నారు.

రికార్డుల తనిఖీ

ఆలమూరు: మండలంలోని సంధిపూడి గ్రామ సచివాలయ పరిధిలో గురువారం వైద్యారోగ్యశాఖ రికార్డుల తనిఖీ జరిగింది. కొత్తపేట అడిషనల్ డీఎంహెచ్‌ఓ ఎం.సుమలత ఆదేశాల మేరకు పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారి పి.భవానీశంకర్ గ్రామ సచివాలయానికి వచ్చి చిన్నారులకు, బాలింతలు, గర్భిణులకు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధుల నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం రికార్డులు తనిఖీ చేసి ఆరోగ్య సిబ్బందికి పలు సూచనలు, సలహాలను అందజేశారు. సీహెచ్‌ఓ పి.రాధాకృష్ణ, హెచ్ఈ ఏవీవీ రాజా అక్కుల, సూపర్‌వైజర్ పివి.రమణారావు, ఏఎన్ఎం కె.విజయలక్ష్మి పాల్గొన్నారు.

సీసీ రోడ్డుకు శంకుస్థాపన

మామిడికుదురు: గడప గడపకూ మన ప్రభుత్వంలో భాగంగా మంజూరైన నిధులతో గన్నేరుపుంత హేబిటేషన్‌లో నిర్మించనున్న సిమెంట్ కాంక్రీట్ రోడ్డుకు శుక్రవారం సర్పంచ్ గౌస్ మొహిద్దీన్ భూమిపూజ చేశారు. పంచాయతీ కార్యదర్శి పీవీఎస్వీ ప్రసాద్ పాల్గొన్నారు.

డ్రై డే పాటించాలి

ఆలమూరు: గ్రామీణ ప్రాంతాల్లో సంపూర్ణ పారిశుద్ధ్యం నెలకొల్పేందు వీలుగా ప్రతి శుక్రవారాన్ని పొడి వారం (డ్రై డే)గా పాటించాలని చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు డి.మల్లికార్జున, పి.భవానీ శంకర్ కోరారు. ఫ్రైడే సందర్భంగా ఆయా గ్రామాల్లోని ఆరోగ్య, ఆశ సిబ్బంది ఇంటింటికి వెళ్లి ఇంట్లో నిల్వ నీరు ఉండకుండా తీసుకోవలసిన చర్యలను వివరించారు. గ్రామాల్లో ఆరోగ్య, ఆశ సిబ్బంది డ్రై డేను వివరిస్తూ ర్యాలీలు నిర్వహించారు.

ప్రత్యేక శ్రద్ధ కనబరచాలి

ఆత్రేయపురం: ప్రజలు రోగాల బారిన పడకుండా తాగునీరు, పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలని పంచాయతీ కార్యదర్శులకు ఎంపీడీఓ నాతిబుజ్జి సూచించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఆమె సమీక్ష నిర్వహించారు.